నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

సోమవారం 11 డిసెంబర్ 2023
MONDAY, DECEMBER 11, 2023 | VIKARABAD | పేజీలు : 8 PAGES



## వంద శాతమే.. 'లక్ష్యం'

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖ సన్నాహాలు



- ఆగస్టులోనే 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- సబ్జెక్టుల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరదీపికలు
- బట్టీ విధానానికి స్వస్తి.. సొంతంగా రాసేలా ప్రోత్సాహం
- నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ చర్యలు
- వికారాబాద్ జిల్లాలో పరీక్షలు రాయనున్న 10 వేల మందికి పైగా విద్యార్థులు

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వికారాబాద్ జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఈ ఏడాది ఆగస్టులోనే 'లక్ష్య' పేరుతో కార్యక్రమానికి రూపకల్పన చేసి, సబ్జెక్టుల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరదీపికలను రూపొందించింది. విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసి అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. బట్టీ విధానానికి స్వస్తి చెప్పి విద్యార్థి అర్థం చేసుకుని అవగాహనతో రాసేలా ప్రోత్సహిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో వార్షిక పరీక్షలు జరుగనుండడంతో ఈ ఏడాది నవంబర్ 14 నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది ఎస్సెస్సీలో 59.4 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈసారి వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లాలో 176 ఉన్నత పాఠశాలలతో పాటు మాడల్ స్కూళ్లు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఉన్నాయి. ఈ ఏడాది దాదాపుగా 10 వేలమందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. – బొంరాస్‌పేట, డిసెంబర్ 10




## పన్ను వసూళ్లు ముమ్మరం..

- ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో 61.75 శాతం ఇంటి పన్ను వసూలు
- ఈ ఏడాది పన్ను వసూలు లక్ష్యం రూ.32.38 కోట్లు
- వసూలైన పన్ను రూ.19.99 కోట్లు కాగా, రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిన జిల్లా
- వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి లక్ష్యాన్ని చేరేలా కార్యాచరణ
- గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు మరింత ఊతం ఇస్తున్న ఇంటి పన్ను ఆదాయం



రంగారెడ్డి జిల్లాలోని 558 గ్రామపంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ.19.99కోట్లు(61.75 శాతం) ఇంటి పన్ను వసూలు కాగా, రాష్ట్రంలోనే జిల్లా నాల్గో స్థానంలో నిలిచింది. ఇంకా రూ.12,38,94,269 బకాయిలు రావాల్సి ఉన్నది. ఈ ఏడాది రూ.32.38కోట్ల ఇంటి పన్నులను వసూలు చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్నది. వచ్చే ఏడాది మార్చిలోగా అనుకున్న లక్ష్యాన్ని చేరేలా అధికారులు కృషి చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లు నిలిచిపోగా, మళ్లీ వసూలు చేసేందుకు అధికారులు దృష్టి సారించారు. గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇంటి పన్ను ఆదాయం మరింత ఊతమిస్తుందని ప్రజలకు అవగాహన కల్పిస్తుండడంతో పన్నులు చెల్లించేందుకు జనం ముందుకొస్తున్నారు.

– రంగారెడ్డి, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ)

## భక్తిపారవశ్యం

ఆలయాల్లో కార్తిక మాస ప్రత్యేక పూజలు


శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలోని మరకత శివాలయానికి పోటెత్తిన భక్తులు

- దీపాలను వెలిగించి కోరిన కోర్కెలు తీర్చాలని ఇష్ట దైవాలను వేడుకుంటున్న భక్తులు
- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- పలుచోట్ల జాతర్లకు పోటెత్తిన భక్తజనం
- వన భోజనాలతో కిటకిటలాడిన ఆలయాల పరిసరాలు


శివాలయంలో పూజలందుకుంటున్న స్వామివారు